క్లుప్తంగా

మకరతోరణం బహూకరణ

విజయనగరం: పట్టణంలోని రింగ్‌రోడ్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయం ఓ వైపు ఆధ్యాత్మికంగానూ.. మరోవైపు సేవాపరంగానూ విరాజిల్లుతోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. భక్తుల సహకారంతో సమకూర్చిన 60 కిలోల వెండి మకరతోరణాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, షిర్డీ సాయిబాబా ఆలయ సేవా సంఘం ఆధ్యాత్మికంగానే కాకుండా సేవారంగంలోనూ వినూత్న ప్రక్రియలు చేపడుతోందన్నారు. పేదలను ఆదుకునేవిధంగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం, ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సేవా సంఘ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఖలీల్‌బాబుకు ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారం అందుకుంటున్న డాక్టర్ ఖలీల్‌బాబు

విజయనగరం టౌన్: హజరత్ ఖాదర్‌వలీ బాబా దర్గా దర్బార్ ధర్మకర్త, ఏటీకే ఆధ్యాత్మిక, సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ తాజ్ ఖాదరీ (ఖలీల్‌బాబు)కు ఉగాది పురస్కారం లభించింది. ఖలీల్ బాబు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన విశాఖకు చెందిన ఆక్టీవ్ చారిటీ ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో అవార్డు అందజేశారు.

శ్రీరామనవమి వసంత నవరాత్రులు ప్రారంభం


ప్రవచిస్తున్న చాగంటి లింగరాజు

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో శ్రీరామ చారిటిబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీరామనవమి వసంత నవరాత్రుల ఉత్సవాలు బుధ వారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ట్రస్టు చైర్మన్ డాక్టర్ తెన్నేటి సుబ్బారావు ప్రారంభించారు. బ్రహ్మశ్రీ చాగంటి లింగరాజు రామా యణంలో బాలకాండపై ప్రవచనాలు చెప్పారు. .కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వేదుల సోమేశ్వరరావు,వడ్లమాని రమణమూర్తి,వేదుల శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

40 మంది పురోహితులకు సత్కారం


పురోహితులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: ఉగాది సందర్భంగా మండలంలోని 40 మంది పురోహితులను స్థానిక వెంకట అమ్మాజీ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, వరదా ఈశ్వరరావు బుధవారం ఘనంగా సత్కరించారు. శోభకృత్ నామ సంవత్సరంలో మండల ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పురోహితులు దీవించారు. కార్యక్రమంలోనాయకులు తోట తిరుపతిరావు,ఇజ్జిరోతు ప్రసాద్, సతివాడ సీతారాం ,బండారు కామేశ్వరరావు, వాల్లె భానుచంద్రరావు పాల్గొన్నారు.

పద్య,నాటక పోటీల్లో విజేతకు సన్మానం


సత్యనారాయణను సన్మానిస్తున్నపెన్షనర్లు

చీపురుపల్లిరూరల్(గరివిడి): తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో ఈనెల 17న నిర్వహించిన జాతీయస్థాయి పద్య నాటక పోటీల్లో మండలానికి చెందిన హొసపు సత్యనారాయణ ఆదికవి నన్నయబట్టు పాత్రను పోషించి పద్యపఠన విభాగంలో విజేతగా నిలిచారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈయన్ని గరివిడి పెన్షనర్ల సంఘ భవనంలో పెన్షనర్లు బుధవారం సన్మానించారు.

వర్షాలకు కూలిన పెంకిటిల్లు

గజపతినగరం రూరల్: మండలంలోని బూడిపేట గ్రామంలో సూర్యనారాయణకు చెందిన పెంకుటిళ్లు గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిని బుధవారం కూలి పోయిందని వీఆర్‌ఓ సత్యనారాయణ తెలిపారు. ఆసమయంలో ఇంటిలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది.

శోభకృత్ సంవత్సరానికి స్వాగతం...


డెంకాడ: నాతవలసలో జరుగుతున్న పంచాంగ శ్రవణం


డెంకాడ: పినతాడివాడలో ఉగాది పచ్చడిని తినిపించుకుంటున్న చిన్నారులు


పూసపాటిరేగ: కోనాడ సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితుడు శర్మ


విజయనగరం టౌన్: పైడితల్లి ఆయలంలో పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితులు


విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ పుస్తకాలను అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ శంకరరెడ్డి, తదితరులు

బ్రహ్మదేవుడు చైత్ర శుద్ధ పాడ్యమి రోజున సృష్టిని ప్రారంభించాడని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ రోజును యుగానికి ఆరంభంగా చెబుతారు. నక్షత్రాల గమనం ప్రకారం వసంత రుతువు ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది కాబట్టి రుతువులు, వర్షపాతం వివరాలు లెక్కించి ఏడాది పొడవునా పాడి, పంట ఎలా ఉంటుందో లెక్కిస్తారు. అంతటి పవిత్రత గలిగిన ఈ రోజు నుంచే తెలుగు సంవత్సరాది ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో ఉగాది పండగను అన్ని వర్గాల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే లేచి తలంటు స్నానాలు చేసి ఇళ్లను మామిడి ఆకులతో అలంకరించారు. కొత్త దుస్తులు ధరించి దైవ దర్శనాలు చేసుకున్నారు. అనంతరం షడ్రుచుల సమ్మేళనంతో (ఉప్పు, పులుపు, చేదు, తీపి, వగరు, కారం) ఉగాది పచ్చడి తయారు చేసుకుని స్వీకరించారు. సాయంత్రం ఆలయాల్లో పంచాంగ పఠనం జరగ్గా.. ఈ ఏడాది పంటల పరిస్థితులపై పండితులు వివరించారు.

– విజయనగరం/నెల్లిమర్ల, నెట్‌వర్క్

బైక్ ర్యాలీకి తరలిరండి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏసు ప్రేమాలయం ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఏసు పునరుత్థానాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 9న పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నామని,ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని ఏసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబటిసత్రం జంక్షన్ వద్ద ఉన్న ప్రేమాలయం చర్చిలో ఏసు పునరుత్థానం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోట వద్ద నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. మూడులాంతర్లు, గంటస్తంభం, కన్యకా పరమేశ్వరి కోవెల కూడలి, గూడ్స్‌షెడ్, కలెక్టరేట్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా తిరిగి కోటకు చేరుతుందన్నారు. క్రీస్తు ఆరాధకులు, బోధకులు, పాస్టర్లు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోరాడ నాగేశ్వరరావు, అలజంగి విక్టర్‌బాబు, జాను, జాకాబ్, చౌదరి, దేవరాజు, నిశాంత్, డేవిడ్ మోడీ, తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు సన్మానం


రుద్రాక్ష మంటప దాతలను సత్కరిస్తున్న ఆలయ ఈఓ శ్రీనివాస్, తదితరులు

విజయనగరం టౌన్: పట్టణంలోని కొత్త అగ్రహారంలో కొలువైన సీతారామ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులను ఘనంగా సత్కరించారు. అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీవిశ్వేశ్వరస్వామికి రూ.75 వేల విలువ చేసే రుద్రాక్ష మంటపాన్ని కమల్‌రాటే దంపతులు వితరణగా అందజేశారు. అనంతరం దాతను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ప్రసారాలు అందజేయడంలో ముందంజ


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న వాజీ కేబుల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు

విజయనగరం టౌన్: నాణ్యమైన ప్రసారాలు అందజేయడంలో వాజీ చానల్ ఎప్పుడూ ముందుంటుందని వాజీ చానెల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. ఉగాది నేపథ్యంలో సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మీడియా ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తోందని చెప్పారు. అనంతరం శివరాత్రి రోజున నిర్వహించిన హౌసీ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేఆర్‌కే రాజు, వాజీ ఆపరేటర్లు తాండవ భువనేశ్వరరాజు, పతివాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలందరూ..

సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల


పంచాంగ శ్రవణంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం: శోభకృత్ నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల నివాసంలో పంచాంగ శ్రవణం జరిగింది. పండితుడు బ్రహ్మశ్రీ పులకండి సతీష్‌కుమార్ శర్మ కొత్త ఏడాదిలో చోటుచేసుకోనున్న శుభ, అశుభాలను వివరించారు. రాశుల ప్రకారం ఆదాయ, వ్యయాలను వివరించడంతో పాటు, వర్షపాతం, పంటల స్థితిగతులపై ప్రవచించారు. పంచాంగ శ్రవణం అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ అందాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. ఎవరికీ ఎటువంటి కష్టనష్టాలు కలగకుండా అందరూ అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ సిటిజన్ విభాగం జిల్లా నాయకుడు కేవీవీ కృష్ణారావు, ప్రముఖ న్యాయవాది కోలగట్ల తమ్మన్నశెట్టి, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, సీనియర్ కార్పొరేటర్ ఎస్‌వీవీ రాజేష్, పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌కౌశిక్, ఆయా జోనల్ ఇన్‌చార్జ్‌లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలందరిపై పైడితల్లి ఆశీస్సులు..

విజయనగరం: ఉత్తరాంధ్ర ప్రజల కల్పవల్లి పైడితల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. ఉగాది సందర్భంగా పైడితల్లి అమ్మవారిని ఆయన దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కోలగట్లను ఆశీర్వదించారు.

కిటకిటలాడిన రహదారులు


ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని రహదారులన్నీ బుధవారం కిటకిటలాడాయి. ముఖ్యంగా బంగారు, ఎలక్ట్రానిక్ వస్తువుల దుకాణాలు వినియోగదారులతో కళకళలాడాయి. కొత్త సంవత్సరాది కావడంతో ప్రజలు కొత్త వస్తువులు కొనుగోలు చేయడంతో రహదారులన్నీ సందడి మారాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రామస్వామి

కొత్తవలస: స్థానిక మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ మచ్చ ఎర్రారామస్వామి తెలిపారు. పంచాయతీ పరిధిలోని 7వ వార్డులో ఏర్పా టు చేసిన డైరెక్ట్ పంపింగ్ సిస్టమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ 15 వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.5 లక్షలు వెచ్చించి తాగునీటి పథకం ఏర్పాటు చేశామన్నారు. 15 వీధి కుళాయిల ద్వారా రోజూ తాగునీరు సరఫరా చేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొల్లు కృష్ణమూర్తి, వార్డు మెంబర్లు రమణబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెనగంటి చెల్లయ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ పాకెట్ క్యాలెండర్ల ఆవిష్కరణ


పాకెట్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంతం

చీపురుపల్లి: యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం పాకెట్ క్యాలెండర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యూటీఎఫ్ సంఘ నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం బుధవారం ఆవిష్కరించా రు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మీసాల అప్పలనాయుడు, చీపురుపల్లి మండలశాఖ అధ్యక్షుడు నడిపేన బలరాం, గౌరవ అధ్యక్షుడు మామిడి శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు వై.వి.రమణ పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం

బొండపల్లి: మండలంలో జాతీయ రహదారి-26కు ఆనుకుని ఉన్న నెలివాడ, అంబటివలస గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు బుధవారం ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రజాప్రతినిధులు తెలిపారు. సర్పంచ్‌లు,ఎంపీటీసీలు తాళ్లపూడి కీర్తి, సిరిపురం కసవయ్య, కొమ్మునాగమణి,తాళ్లపూడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, రౌతు చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం


విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న గ్రంథాలయ నిర్వాహకుడు రమణ, తదితరులు

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో నడుపుతున్న ప్రజాగ్రంథాలయం వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యతకను వివరించారు. విద్యార్థులు సెలవుదినాల్లో గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని సూచించారు. విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. గ్రంథాలయ నిర్వాహకుడు రెడ్డి రమణ, ఉపాధ్యాయుడు డోల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తీర్థమహోత్సవాలు


జామి: తానవరంలో పూజలందుకుంటున్న నూకాలమ్మ తల్లి


జామి: ఆంజనేయస్వామి ఆలయంలో దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు


వేపాడ: వావిలపాడులో ఎడ్ల పరుగు ప్రదర్శన

జామి: మండలంలోని తానవరం గ్రామంలో నూకాలమ్మ తల్లి, మండల కేంద్రంలోని దొండపర్తి జంక్షన్‌వద్ద ఆంజనేయస్వామి తీర్థమహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. తానవరంలో నూకాలమ్మ అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా నిర్వాహకులు బాలులకు పరుగు పందాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు

వేపాడ: మండలంలో వావిలపాడులో నూకాలమ్మ తల్లి పండగ, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్కంఠగా సాగింది. విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 24 జతల ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన ఎద్దులకు సంబంధించిన యజమానుల కు గ్రామపెద్దలు, ఉత్సవకమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. కె.జె.పురం గ్రామానికి చెందిన కొయిలాడ మోహన్ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.12 వేలు, వల్లంపూడికి చెందిన శానాపతి సత్తిబాబు ఎద్దులు రెండో స్థానంలో నిలిచి రూ.10 వేలు, దేవరాపల్లికి చెందిన వీరాంజనేయ ఎద్దులు మూడో స్థానంలో నిలిచి రూ.8 వేలు నగదు బహుమతులు గెలుచుకున్నాయి.

కమనీయం భద్రావతి,భావనారుషిల కల్యాణం


కల్యాణ మహోత్సవంలో ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్సీ రఘురాజు


జామి: పూజలందుకుంటున్న భీమసింగి వేంకటేశ్వరస్వామి


జామి: ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి


దత్తిరాజేరు: తులసీదళాలు, పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి

శృంగవరపుకోట: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కృష్ణాపురం గ్రామంలో భద్రావతి, భావనారుషిల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. రెండు రోజులపాటు భద్రావతి, భావనారుషీశ్వరుల ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 11గంటల సమయంలో ఆలయంలో కల్యాణం వేదోక్తంగా జరిపించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు, ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


వేపాడ: పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి

జామి: ఉగాది సందర్భంగా భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వెంకటేశ్వరస్వామి, అన్నంరాజుపేటలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో అర్చకులు వరప్రసాద్, ఫణిహారం సీతారామాచార్యుల ఆధ్వర్యంలో బుధవారం విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలను, స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


వేపాడ: కృష్ణాలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలోని శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. పూజారి కందాడ హరికృష్ణ ఆధ్వర్యంలో తెల్లవారు జామున స్వామి వారికి ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు,లక్ష్మీ దంపతులు పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

వేపాడలో..

వేపాడ: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు.వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్, శ్రీకృష్ణాలయంలో గోపాల కృష్ణ యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.స్వామి వార్లను విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.